క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గద్వాల నుంచి రాయచూర్ వైపు బొలెరో వాహనంలో ఇద్దరు వివిధ గ్రామాల నుంచి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి రాయచూర్‌కు తరలిస్తుండగా నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. నిందితులు వెంకటేష్, ఉరుకుందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఏఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దన్నారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం కమిటీ ఎన్నిక



అలంపూర్: ఎత్తిపోతల పథకం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని రైతు సంఘం వద్ద జోగుళాంబ దేవి ఎత్తిపోతల పథకం నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బ్రహ్మేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రజినిబాబు, సహాయ కార్యదర్శిగా పెద్దబాబు, కోశాధికారిగా విశ్వనాథం, సభ్యులుగా చెంచయ్య, జయన్న, హరినాథ్‌రెడ్డి, రమేష్, న్యాయ సలహాదారుగా నాగరాజుయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, జితేంద్‌గౌడు, రేపల్లె దేవదాసు, శేఖర్ రెడ్డి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

శాంతినగర్: సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి రాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం సబ్సిడీతో 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 30 కేజీల బస్తాకు రూ.2,138 చెల్లించాలన్నారు. సోమవారం నుంచి విత్తనాలు అందుబాటులో ఉంటాయని అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేసి ఆగ్రోస్ సేవా కేంద్రంలో విత్తనాలు తీసుకెళ్లాలని ఏఓ పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ స్థానిక కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



రాజోళి: పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పశు సంవర్ధక శాఖ అధికారులు హెచ్చరించారు. స్థానిక సుంకేసుల డ్యాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీలు చేపట్టారు. పశువులను తీసుకెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ ప్రసాద్, కానిస్టేబుల్ భరత్ తదిదరులు పాల్గొన్నారు.

అడుగడుగునా అవరోధాలే

- మూతబడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖద్వారం
- దారి ఇవ్వాలంటున్న మున్సిపల్ అధికారులు
- నిబంధనలు ఒప్పుకోవంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖద్వారం వద్ద అడ్డుగా సేఫ్టీస్టోన్స్

అయిజ: మున్సిపాలిటీలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్ సముదాయం) నిర్వహణకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతూనే ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో రూ.2 కోట్ల నిధులతో మొత్తం 40 గదులతో ఇంటిగ్రేటెడ్ మార్కెటును ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయి నాలుగు ఏళ్లు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి పక్కన అప్రోచ్ రోడ్డుకు సేఫ్టీ స్టోన్స్ ఏర్పాటు చేయడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రధాన రహదారి సంపూర్ణంగా మూతపడింది. ఈ నేపథ్యంలో కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని మున్సిపల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూతపడిన ముఖద్వారం

పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై వంతెన నిర్మించడంతో దానికి గత సంవత్సరం అప్రోచ్ రోడ్డు నిర్మించారు. దీంతో ఇంటిగ్రేటెడ్ ముఖ ద్వారం కంటే ఆర్‌అండ్‌బీ రోడ్డు అరడుగుల ఎత్తుగా వేయడంతో మార్కెట్ భవన సముదాయం పల్లమయ్యింది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రస్తుతం సేఫ్టీస్టోన్స్ ఏర్పాటు చేయడంతో మార్కెట్ ముఖ ద్వారం పూర్తిగా మూసుకుపోయి రాకపోకలకు అవరోధంగా మారింది.

రూ. 20 లక్షలు వృథా

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చేపట్టిన అప్రోచ్ రోడ్డుకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. గతకొన్ని రోజులుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఒక ద్వారం వైపు నిర్మాణం పనులు పూర్తవగా రెండో వైపు ముఖద్వారం వద్ద స్లాబ్ నిర్మించే దిశలోనే పనులు నిలిపేశారు. మున్సిపల్ ఏఈ విధుల్లో లేకపోవడంతో పనులు నాసిరకంగా చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శిస్తుండటంతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపేశారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయం లోపంతో ఆర్‌అండ్‌బీ అధికారులు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడు మున్సిపల్ అధికారుల సూచనలు తీసుకోలేదు. మున్సిపల్ అధికారులు సైతం ఆర్‌అండ్‌బీ శాఖతో చర్చించ లేదు. ఎవరి పనులు వారే చేసుకుంటూ పోవడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు చిక్కుముడులు పడుతూ వచ్చాయి.

ఢీ అంటే ఢీ అంటున్న అధికారులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు అడ్డుగా నిర్మించిన సేఫ్టీ స్టోన్స్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను అడగ్గా నిబంధనలు ఒప్పుకోవని, అలా చేసినా సరే ప్రతిరోజు యాక్సిడెంట్లు జరుగుతాయని ప్రజల ప్రాణాలకు పెనుప్రమాదం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. ఎలాగైనా సరే మార్కెట్ దారికి అడ్డుగా ఉన్న సేఫ్టీ స్టోన్స్‌ను తొలగిస్తామని మున్సిపల్ అధికారులు అంటున్నారు.సేఫ్టీ స్టోన్స్‌ను తొలగించే ప్రసక్తే లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు తెగేసి చెబుతున్నారు.

సేఫ్టీస్టోన్స్ తొలగిస్తాం



చిరు వ్యాపారులు ఒకే చోట క్రయవిక్రయాలు నిర్వహించేందుకు రూ.2.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టాం. రెండు ద్వారాలు ఏర్పాటు చేశాం. ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఎత్తుగా చేపట్టడంతో మరో రూ. 20 లక్షలు ఖర్చు చేసి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు మళ్లీ ఇంటిగ్రేటెడ్ ముఖ ద్వారానికి ఎదురుగా సేఫ్టీ స్టోన్స్ ఏర్పాటు చేయడంతో మార్కెట్ లోపలికి ప్రవేశించే మార్గమే లేకుండా పోయింది. ఎలాగైనా సరే సేఫ్టీ స్టోన్స్ తొలగిస్తాం.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

తొలగించే ప్రసక్తే లేదు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకముందే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం. దానికి అప్రోచ్ రోడ్డునే ఏర్పాటు చేశాం. ఆర్‌అండ్‌బీ వారి పనులు పూర్తిచేశాక ఇప్పుడు మున్సిపల్ అధికారులు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సేఫ్టీస్టోన్స్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ముఖ ద్వారం మూసివేసినట్లుందని రాళ్లు తొలగించమని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. దానికి నిబంధనలు ఒప్పుకోవు. స్టోన్స్ తొలగిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉంది.

– అల్తాఫ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

రాజోళి: మండలంలోని చిన్నధన్వాడ గ్రామానికి చెందిన మూగ రాజశేఖర్‌పై దాడి చేసిన రాజోళి ఎస్‌ఐ జగదీష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సోషల్ మీడియాలో ఆదివారం వీడియో వైరల్ అయింది. దీనిపై సదురు మూగ రాజశేఖర్ సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. ననసూరు శివారులోని భూమి విషయంలో దాయాదులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఈనెల 23వ తేదీన రాజోళి పోలీస్ స్టేషన్‌కు రమ్మని పిలిచి ఎస్‌ఐ జగదీశ్ దుర్భాషలాడుతూ, కులం పేరుతో దూషిస్తు కాలితో గుండెలపై తన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎలాంటి దాడి చేయలేదు..

ఈ విషయమై రాజోళి ఎస్‌ఐ జగదీష్‌ను వివరణ కోరగా భూమి విషయంలో ఫిర్యాదు రాగా ఇరు వర్గాల వారిని పిలిచి ఎలాంటి తగాదాలు లేకుండా సర్దుబాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఆయన కాలితో తన్నినట్లు చెబుతున్నారని, తన కాలు విరిగిన విషయం అందరికీ తెలుసని, కాలితో కొట్టేంత స్థితిలో లేనని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న దానిలో వాస్తవం లేదన్నారు.

సింగిల్ విండోలో దీర్ఘకాలిక రుణాలు

అయిజ: సింగిల్ విండో ద్వారా రైతులు దీర్ఘకాలిక రుణాలు పొందవచ్చని సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్షక మిత్ర ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా డీసీసీబీ బ్యాంక్ నుంచి దీర్ఘకాలిక రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు ఎకరాల వరకు పొలాన్ని సింగిల్ విండోకు మార్టిగేజ్ (తనఖా) చేస్తే గరిష్ఠంగా రూ. 10 లక్షలు వరకు రుణం పొందవచ్చన్నారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్కీం ద్వారా ట్రాక్టర్, హార్వెస్టర్ తదితర వాటికి తొమ్మిది శాతం వడ్డీతో రుణాలు, కంతులు క్రమం తప్పకుండా చెల్లించే రైతులకు కేంద్ర ప్రభుత్వం తిరిగి మూడు శాతం వడ్డీ అకౌంట్లోకి జమ చేస్తుందన్నారు. కేవలం 6 శాతం వడ్డీకే రుణం పొందే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



ఎర్రవల్లి: మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదివారం గ్రామస్తులు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సాసనూలు గ్రామ పంచాయతీలో ఆమ్లేట్ గ్రామంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 1200 జనాభా కలిగిన తమ గ్రామాన్ని జీపీగా ఏర్పాటు చేయాలని ఎర్రవల్లి కూడలిలో సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి ఆయన సమస్యను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



కోతులగిద్దలో కురుస్తున్న వర్షం



ధరూరులోని కుర్వవీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ధరూరు: చిన్నపాటి వర్షానికే మండల కేంద్రంలని రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. కుర్వవీధి, బోయ వీధులతో పాటు ముస్లిం కాలనీలోని రోడ్లపై నీళ్లు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు రోడ్లపై నిలుస్తుండడంతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కోతుల గిద్ద, అల్వలపాడు, జాంపల్లి, ధరూరు, బూరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు, మురుగు నిలిచి ప్రజలు అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అభయాంజనేయస్వామికి అభిషేకం



వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల

మదనాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మదనాపురం అభయాంజనేయ స్వామి మూడో వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు, గోపాలకృష్ణ గురు స్వామి, రవికాంత్ జోషి స్వామి ఆధ్వర్యంలో స్వామివారి బారి విగ్రహానికి, క్షీరాభిషేకం, జలాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ రజితొట్టి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు ఘన సన్మానం



గద్వాల: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్‌టేటీవ్ కమిటీ తెలంగాణ చైర్‌పర్సన్‌గా నియమించిన నేపథ్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండల వెంకట్రాములు, మాజీ కౌన్సిలర్, ఎస్‌వీఎం నారాయణగౌడ్, ఆర్‌ఆర్ శ్రీనివాస్ శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న విజయకుమార్

అయిజ: రాష్ట్ర వ్యాప్తంగా పండిత్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని బహుజన క్లాస్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ విజయకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోపు కేటగిరీల వారీగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్లు, స్కావెంజర్ల్, వంట ఏజెన్సీ నిధులు ముందస్తుగా విడుదల చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, దీర్ఘకాలికంగా పెండిగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీని అమలు చేయాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జూనియర్ లెక్చరర్ల పోస్టుల ప్రమోషన్, డిప్యూటీ డీఈఓల ప్రమోషన్, మండల విద్యాధికారుల ప్రమోషన్లు వెంటనే చేపట్టాలన్నారు. జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ నిధులు, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రాథమిక స్థాయిలో భాషా నైపుణ్యాలను పెంచేందుకు తెలుగు, హిందీ ఉర్దూ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబేల్, నాగరాజు, ప్రభాకర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షాలేం చర్చి వార్షికోత్సవం



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సంపత్‌కుమార్



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో ఎంబీ షాలేం చర్చి 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. క్రైస్తవ సమాజ స్థాపనకు తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, క్రైస్తవులు పాల్గొన్నారు.

వీధికుక్కల స్వైర విహారం



జింకలపల్లి స్టేజిలో రోడ్డుపై స్వైర విహారం చేస్తున్న కుక్కలు

ఇటిక్యాల: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులపై ఇష్టానుసారంగా దాడి చేసి గాయపరుస్తున్నట్లు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా గతేడాది 182 మంది కుక్క కాటుకు గురైనట్లు తెలిపారు. జింకలపల్లి స్టేజీలో వీధికుక్కలు నిత్యం దాడి చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కుక్కల బెడద మండలంలో అధికంగా ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వెలగని లైట్లు.. తప్పని తిప్పలు



ఎర్రవల్లి కూడలిలో వెలగని హైమాక్స్ లైట్లు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఎర్రవల్లి కూడలిలో కొన్ని రోజులుగా హైమాక్స్ లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు హైవే దాటాలంటే తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. కూడలిలో ఎటు చూసినా అంధకారంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కూడలిలో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన కల్వర్టు నిర్మించాలి



ఇటిక్యాల శివారులో పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టు

ఇటిక్యాల: మండల కేంద్ర శివారులో రహదారిపై గతంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని కల్వర్టుపై ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. తేలికపాటి వర్షం కురిసినా కల్వర్టు నీటితో నిండుకుండలా మారుతుందంటున్నారు. పలు మార్లు అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కల్వర్టు నిర్మించాలని ఆయా గ్రాయాల వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రాజస్తానీ యువక మండలి ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం, మహేశ్ నవమిని పురస్కరించుకొని రాజస్తానీ నవయువక మండలి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ యువకులు, మహిళలు రక్తదానం చేశారు. ప్రతి ఏడాది మహేశ్ నవమి సందర్భంగా మార్వాడీ సమాజం ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని.. ఈ ఏడాది ప్రత్యేకంగా భారత్ విజయం సాధించినందుకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నవయువక మండలి అధ్యక్ష, కార్యదర్శులు అమిత్ బాంగడ్, మహేశ్ చందర్ దూత్, మార్వాడీ సమాజం పెద్దలు భగవాన్ దాస్ రాటి, ఓంప్రకాశ్ బాంగడ్, సురేశ్ చందర్ దూత్, నత్మల్ జవర్, రాజేందర్ బంగ్, గోపాల్ లోయ, కమల్‌రాటి, విష్ణు రాటి పాల్గొన్నారు.

ప్రమాదం.. పట్టించుకోండి సారూ!



మానవపాడు- చెన్నిపాడు రోడ్డు దుస్థితి



చెన్నిపాడులో గుంతలమయంగా రోడ్డు

మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడు వెళ్లే రోడ్డు దుస్థితి దారుణంగా ఉంది. నిత్యం మా నవపాడు నుంచి అలంపూర్ చౌరస్తా మీదుగా కర్నూలుకు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై రాత్రి సమయాల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి

కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ స్టేజీ సమీపంలోని ర్యాలంపాడు ఎడమ కాల్వ వద్ద జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రహదారి మధ్యలో గుంత ఏర్పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు పేర్కొన్నారు. ప్రమాదం సంభవించకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంత పూడ్చాలని కోరుతున్నారు.